క్లుప్తంగా

ఉషూలో ప్రతిభ చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): ఉషూలో ప్రతిభ చాటాలని ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్ పాఠశాలల ఉషూ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏటా ఒలింపిక్ డే పురస్కరించుకొని బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే సోమవారం కర్నూలు నగరంలో నిర్వహిస్తున్న ఒలంపిక్ డే పరుగులో ప్రతి క్రీడాకారుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ సంఘం నిర్వహణ కార్యదర్శి సునీల్‌కుమార్, ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు, మాస్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే

కోడుమూరు రూరల్: కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ ఆదివారం బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఈయన విభేదాలతో ఇటీవల బయటకు వచ్చారు. కొద్దికాలం స్తబ్దుగా ఉన్నారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణతో కలిసి విజయవాడకు వెళ్లి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



జెండా ఎగురవేస్తున్న రాజునాయుడు

పాణ్యం: నేతాజీ సుభాస్ చంద్రబోస్ ఆశయాలతో ముందకు సాగుతున్నట్లు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాజునాయుడు అన్నారు. ఆదివారం పార్టీ 86వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పాణ్యంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల తరపున వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోష్ ఆశయాలకు అనుగుణంగా ఉద్యమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తెచ్చామన్నారు. ప్రతి ఒక్కరికీ రాజ్యాంగ ఫలాలు, అందాలనే ఉద్దేశంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవీంద్ర, చిరంజీవి, వనం వెంకటాద్రి, హనుమంతు, సురేంద్ర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వ మందలించినందుకు మనవడి ఆత్మహత్య

కర్నూలు: అవ్వ మందలించినందుకు మనవడు గోపి (25) ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్నూలులో వెలుగు చూసింది. నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని గీతానగర్‌లో వృద్ధురాలు రుక్మిణమ్మ నివాసం ఉంటుంది. కొడుకు సురేష్, మనవడు గోపి ఆమె వద్దనే ఉంటున్నారు. సురేష్ గుంటూరులో గౌండ పని చేస్తూ ఖర్చుల నిమిత్తం ఇద్దరికి డబ్బులు పంపేవాడు. అయితే చెడు వ్యసనాలకు బానిసై డబ్బులు ఖర్చు చేస్తూ, అప్పులు చేస్తుండటంతో అవ్వ మందలించింది. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి రేకుల షెడ్డులో ఐరన్ రాడ్డుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న నాలుగవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. నాలుగవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్ల సమ్మె నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు వెల్లడించారు. కమిషనర్ ఆదివారం అశోక్‌నగర్‌లో నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు వేతనాల విషయంపై సమ్మె చేస్తున్నారన్నారు. అయినప్పటికీ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాత్కాలిక కార్మికులతో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. సమస్యలు ఉంటే స్థానికంగా ట్యాప్ ఇన్‌స్పెక్టర్, అమినిటీస్ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

కర్నూలు (టౌన్): సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర ఉన్న వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులను కౌన్సెలింగ్ చేయాలన్నారు.

ఇంట్లో పొగాకు గుట్టలు.. రైతుకు కన్నీళ్లు

- రైతుల ఇళ్ల నుంచి కదలని పొగాకు
- వేలంలో నిత్యం వందల బేళ్లు తిరస్కరణ
- పట్టించుకోని ప్రభుత్వం
- దయనీయంగా పొగాకు రైతుల పరిస్థితి



గడివేములలో రైతు ఇంట్లో నిల్వ ఉంచిన పొగాకు

గడివేముల: పొగాకు రైతులకు గడ్డు కాలం వచ్చింది. కూటమి పాలనలో పొగాకు రైతులు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా వాణిజ్య పంట అయిన పొగాకును ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో నాణ్యమైన పొగాకు పండిస్తారని గడివేములకు పేరుంది. అయితే గతేడాది సాగు ప్రారంభం నుంచి అమ్మకం వరకు రైతులు అష్టకష్టాలు పడుతూనే ఉన్నారు. సాగు ప్రారంభంలో అకాల వర్షాలు ఇబ్బంది పెట్టగా పొగాకు అమ్మకాల్లో గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పొగాకు రైతును ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోజు రోజుకు ధర తగ్గి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు 25 శాతం పొగాకు కూడా కొనుగోలు చేయలేదు. పొగాకు బోర్డు పరిధిలో గడివేముల పరిధిలోని ఒండుట్ల, పైబోగుల, గని, గడివేముల, బొల్లవరం, ఆళ్లగడ్డ గ్రామాల్లో దాదాపు రెండు వందల ఎకరాల్లో చుక్క బార్లి పొగాకు సాగు చేశారు. ఆయా గ్రామాల్లోని రైతులతో ఐటీసీ, జీపీఐ కంపెనీలు ఒప్పందం కుదుర్చున్నాయి. అయితే సీజన్ ముగిసి ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైంది. ఒక్కో రైతు ఇంట్లో 60 నుంచి 80 క్వింటాళ్ల వరకు పొగాకు నిల్వ ఉండిపోయింది. వాటిని ఇప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో తెచ్చిన అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

సిండికేట్‌గా వ్యాపారులు

పొగాకు కంపెనీలు సిండికేట్ మారి రైతులను నట్టేట ముంచుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా పొగాకు రైతుల సమస్యలను ఏనాడు పట్టించుకోలేదు. ధరలు లేవని రైతులు వేలాన్ని అడ్డుకొని రోడ్డెక్కుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ రంగంలోకి దించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు వేలంలో ఇష్టం వచ్చినట్లు ధరలు ఇస్తూ రైతులను ముంచుతున్నారు. వేలంలో గ్రేడ్–1 పొగాకును మాత్రమే కొని మిగతా బేళ్లను తిరస్కరిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో బేళ్లు వెనక్కి రావడంతో వాటిని తిరిగి ఇళ్లకు చేర్చేందుకు రైతులు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. కేవలం ఒకటి రెండు కంపెనీలు మాత్రమే వేలంలో యాక్టివ్ ఉండటం వల్లే ధరలు రావడం లేదని రైతులంటున్నారు.

ఇళ్లలో పేరుకుపోయిన నిల్వలు

బోర్డు అధికారులు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం, అన్ని గ్రేడ్‌ల పొగాకు బేళ్లను కొనుగోలు చేయకపోవడంతో రైతుల ఇళ్లల్లో గుట్టలుగా ఉన్నాయి. అయితే అకాల వర్షంతో మొదటి విడత పంట నాణ్యత కొంత మేర తగ్గగా రెండో విడతలో నాణ్యమైన పొగాకు వచ్చింది. కొందరు రైతులు రెండో విడతలో వేసిన పొగాకు అధిక ఉష్ణోగ్రత వల్ల పంట దెబ్బతింది. దీంతో పొగాకు రైతుకు గడ్డుకాలం వచ్చింది. అయితే వేలం కేంద్రం వద్దకు రైతులు నాలుగు రకాల బేళ్లను తీసుకెళ్లగా మంచి గ్రేడు ఉన్నది మాత్రమే తీసుకొని మిగతాది కొనడం లేదు. దీంతో వాటిని పలు మార్లు ట్రాక్టర్లలో అద్దెలు కట్టి తీసుకెళ్లలేక అదనపు పెట్టుబడి పెట్టలేక రైతులు ఇంట్లోనే బేర్చుకుని దిగాలు చెందుతున్నారు.

గతమెంతో ఘనం

గతంలో కనిగిరి టొబాకో బోర్డు పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 7.58 మిలియన్ కేజీల ఉత్పత్తి దిగుబడి వచ్చింది. దాదాపు రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని బోర్డు అధికారులు, ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత ప్రభుత్వంలో గరిష్ట ధర రూ.300 పైనే రైతులకు వచ్చింది. కనిష్ట ధర రూ.280 వరకు కొనుగోలు చేశారు. ఎందుకు పనికిరాని గుల్లాకు సైతం రూ.250 పైనే బోర్డులో కొనుగోలు చేశారు. ఆ ధరలను చూసిన రైతులు గతేడాది ఎంతో ఉత్సాహంగా పొగాకు సాగు చేశారు. అయితే పంట దిగుబడి సరిగా రాక.. పెట్టుబడులు పెరిగి.. గిట్టుబాటు ధర లభించక లబోదిబోమంటున్నారు.

అడిగే నాథుడు కరువయ్యాడు



నేను పది ఎకరాల దాకా కౌలుకు తీసుకుని పొగాకు పంటను సాగు చేశాను. పంట సాగు చేసే ముందే ఐటీసీ, జీపీఐ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని సాగు చేశాను. ఐటీసీతో కుదుర్చున్న ఒప్పందం ప్రకారం అమ్మకాలు చేశాను. అయితే జీపీఐ కంపెనీ ఇంతవరకు ఒక్క క్వింటా కుడా కొనుగోలు చేయలేదు. ఎకరాకు కౌలు, పెట్టుబడితో కలిపి రూ.లక్ష దాకా ఖర్చు చేశాను. ఇప్పటికీ ఇంట్లో దాదాపు రూ.9 లక్షల విలువ చేసే 70 క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పొగాకు కొనుగోలు చేసి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– పైపాలెం ఉశేని, పొగాకు రైతు, గడివేముల

అప్పులు మిగిలాయి



నేను ఐదెకరాల్లో పొగాకు సాగు చేశాను. గత ప్రభుత్వంలో పొగాకు మంచి ధర కల్పించడంతో మంచి ఆదాయం వస్తుందని సాగు చేశాను. పంట దిగుబడి బాగానే వచ్చింది. అయితే రేటు లేకపోవడంతో పాటు నాణ్యత పేరుతో ట్రాక్టర్లలో తీసుకెళ్లిన పొగాకును వెనక్కి పంపారు. దీంతో ఇప్పటికీ ఇంట్లో 20 క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉంది. పెట్టుబడికి తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– అబ్దుల్ రహీం, పొగాకు రైతు, గడివేముల

అధికారులందరూ హాజరుకావాల్సిందే

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. అలాగే సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్

అర్జీదారులు సమర్పించిన దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగ అర్జీదారులు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నగర పాలక సంస్థలో

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైన సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో?

- మజారా గ్రామం సోమాపురం వాసుల కష్టాలు
- సైకిల్ తొక్కడం రాకుంటే బడి మానేయాల్సిందే



కొర్రపోలూరు నుంచి సోమాపురానికి వెళ్లే రోడ్డు దుస్థితి

గడివేముల: మండల పరిధిలోని కొర్రప్రోలూరు గ్రామ పంచాయతీ మజరా గ్రామం సోమాపురానికి తారు రోడ్డును మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో 70 ఇళ్లకుగాను 310 మంది జనాభా ఉన్నారు. గత కొన్నేళ్ల నుంచి తారు రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న పని పడినా గడివేములకు రావాల్సి ఉంటుంది. కొర్రపోలూరు నుంచి సోమా పురం వరకు 1.5 కిలోమీటర్ల దూరం మెటల్ రోడ్డు ఉంది. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న పనిపడినా కొర్రపోలూరు వరకు నడుచుకుంటూ వచ్చి అక్కడినుంచి ఆటోలు, బస్సుల్లో వెళ్లాల్సి ఉంటుంది. గ్రామం నుంచి రోజూ 20 మంది దాకా విద్యార్థులు గడివేములలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూలుకు సైకిళ్లపై వస్తుంటారు. గడివేముల నుంచి సోమాపురానికి నాలుగు కి.మీ దూరం సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి చదువుకుంటున్నారు. మెటల్ రోడ్డు, రాళ్లు లేచి ఉండటంతో సైకిల్‌పై వెళ్లడం కష్టంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. సైకిల్ తొక్కడం రాకపోతే స్కూళ్లకు పోవడం మానేయాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో రాత్రి పూట, వర్షా కాలంలో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డు మంజూరుతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతలమయంగా రోడ్డు



కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం రోడ్డు గుంతలమయంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సుమారుగా రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వాహనదారులు ప్రయాణిస్తుంటారు. కొన్ని చోట్ల రోడ్డు ధ్వంసమై కంకర తెలింది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ, పట్టణ రోడ్లను మరమ్మతులు చేస్తామ ని, అవసరమైన చోట్ల రోడ్లు నిర్మిస్తామని హామీ లు ఇచ్చిందే తప్పా అమలు చేయడంలో విఫలమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన లక్ష్మీపురం రోడ్డు

ఏపీ ఎంఈయూకు గుర్తింపు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు జీఓ 344లో ఉన్న బెనిఫిట్స్ ఇవ్వాలని ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, తద్వారా యూనియన్‌కు తిరిగి గుర్తింపు లభించినట్లయ్యిందని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.బాలునాయక్ చెప్పారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ 1953 నుంచి వైద్య ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నాయకులు అనేక పోరాటాలు చేసి విజయం సాధించారన్నారు. అప్పటి నుంచి యూనియన్ గుర్తింపు కొనసాగుతూనే ఉందన్నారు. కొన్ని కారణాల వల్ల హక్కులను ప్రభుత్వాలు గుర్తించలేదని, 2023 నుంచి ఇతర సంఘాల లాగా ప్రీవిలేజ్ ఇవ్వాలని అనేకసార్లు విన్నవించామన్నారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు ఏపీ హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో జీఓ 344లో ఉన్న బెనిఫిట్స్ ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. యూనియన్ అంటే నాల్గవ తరగతి ఉద్యోగులే కాదని, పారామెడికల్ సిబ్బంది, స్టాఫ్‌నర్స్, హెడ్‌నర్సు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, వైద్య ఉద్యోగులందరినీ కలుపుకుని త్వరలో కర్నూలు జిల్లా, సిటీ కమిటీలను ఏర్పాటు చేసి బలోపేతం చేస్తామన్నారు.

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



అభిషేకాలు చేస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన చలివిపిండి తయారు చేసి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. అధికారులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో పర్యవేక్షకుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. అకడమిక్ బిల్డింగ్– 1 రెండో అంతస్తులో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సు నిర్వహించే డిపార్టుమెంట్ ఉండేది. వివిధ కారణాలతో నాలుగు సంవత్సరాల కిత్రమే ఆ కోర్సును తీసివేశారు. అయితే ఆ కోర్సుకు సంబంధించిన డిపార్ట్‌మెంట్‌లో కోర్సు పేరు, టీచింగ్ ఫ్యాకల్టీ పేర్లు ఉన్న బోర్డులు అలాగే ఉండటం చూసిన వారు ఆశ్చర్యపోతున్నారు. వర్సిటీలో కోర్సే లేకున్నా ఇంత నిర్లక్ష్యమా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.



ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సు, ఫ్యాకల్టీ పేర్లు ఉన్న బోర్డు

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె క్రిష్ణ

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె క్రిష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మూడు విడతల కరువు భత్యాన్ని చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చేపట్టిన నాడు–నేడు పనుల్లో భాగంగా మొదలు పెట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, రాష్ట్ర నాయకులు రత్నం ఏసేపు, మజాహర్ బాషా, జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం ఉంటే సంప్రదించండి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని క్యాంపస్ సెక్షన్ పరిధిలోని అన్ని కాలనీలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి తెలిపారు. ఈ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగితే 08518–229862, 73827 87842 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని సూచించారు. గాయత్రీ ఎస్టేటు, దేవనగర్, లక్ష్మీనగర్, శ్రీరాంనగర్, బిర్లాగేట్, ఎండోమెంటు కాలనీ, మద్దూర్‌నగర్, బి.క్యాంపు, సి.క్యాంపు, డాక్టర్స్ కాలనీ, శ్రీలక్ష్మీనగర్, కమాలానగర్, కిసాన్ నగర్, మహాలక్ష్మీనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారథి నగర్, గణేష్‌నగర్, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సోమిశెట్టినగర్, టిలికాంనగర్, ధనలక్ష్మీనగర్, చెక్ పోస్టు ఏరియా, గఫూర్‌నగర్, అమ్మహాస్పిటల్ ఏరియా, హౌసింగ్ బోర్డు కాలనీ, మారుతీనగర్, మారుతీ మెగాసిటీ, 100 అడుగుల రోడ్డు, వాసవీనగర్, నందికొట్కూర్ రోడ్డు, జొహరాపురం రోడ్, లక్ష్మీ టౌన్‌షిప్, పోస్టల్ కాలనీ, సింధూఎస్టేటు, ఎలుకూరు ఎస్టేటు తదితర కాలనీల వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు.

ఆదమరిస్తే అంతే

- నడిరోడ్డుపై గుంత
- పొంచి ఉన్న ప్రమాదం



తేరుబజార్‌కు వెళ్లే రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని మెయిన్ బజార్ నుంచి తేరుబజారుకు వెళ్లే దారిలో మురుగు నీటి కాల్వలో పేరుకుపోయిన చెత్తను తొలగించే క్రమంలో ఏడాది కిందట పంచాయతీ సిబ్బంది నడిరోడ్డుపై కల్వర్టును పగులగొట్టి అలాగే వదిలేశారు. రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టుపై ఉన్న భారీ గొయ్యికి రక్షణగా ఇనుపకంచె మూతను వేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వదిలేయడంతో కారులు, ద్విచక్రవాహనదారులు గొయ్యిని గమనించకుండా వెళ్లి అందులో పడి ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇటీవల రాత్రి వేళలో ఓ కారు డ్రైవర్ గొయ్యిని గమనించకుండా వచ్చి అందులో పడడంతో కారుకు సంబంధించిన ఇంజిన్ ధ్వంసమైంది. అలాగే ద్విచక్రవాహనదారులు కూడా తరచూ గోతిని గమనించకుండా వెళ్లి ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రక్షణగా ఇనుప కడ్డీలతో కూడిన మూతను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నటేకూరులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తచెదారం



➤ ఈ దృశ్యం చిన్నటేకూరులో ప్రధాన రోడ్డు పక్కన ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వివిధ గ్రామాలకు చెందిన వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు పక్కన చెత్తచెదారం ఉండడంతో దుర్వాసన వస్తోందని ప్రయాణికులు, గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- విజృంభిస్తున్న ఈగలు, దోమలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- పట్టించుకోని అధికారులు

➤ ఈ దృశ్యం బస్తిపాడు గ్రామంలోనిది. గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువలో చెత్తచెదారం, పేపర్లు, సీసాలతో నిండి ఉంది. వాతావరణ మార్పుల వల్ల డ్రైనేజీ ఈగలు, దోమలు, లార్వాలకు నెలవుగా మారింది. నిత్యం ప్రజలు సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. కాలువ నుంచి దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలో ఉన్న చెత్త చెదారం తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బస్తిపాడులో చెత్తచెదారంతో నిండిన డ్రైనేజీ

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మండలంలో 18 గ్రామ పంచాయతీలు, మజారా గ్రామాలతో కలిపి మొత్తం 26 గ్రామాలు ఉన్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. మురుగు, చెత్త, దోమలు, ఈగలు, లార్వాల సంతతికి నెలవుగా మారాయి. కొన్ని గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండిపోయి పూడికతో పాటు కొన్ని గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. డ్రైనేజీ కాలువల్లో చెత్తచెద్దారం, పేపర్లు, సీసాలు ఉండడంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. మురుగు నీరు నిల్వ ఏర్పడి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో దోమలు, ఈగలు, ల్యారాలు ప్రబలుతున్నాయి.

నెరవేరని లక్ష్యం

కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తోంది. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమ లక్ష్యం నెరవేరడం లేదు. గత కొంతకాలంగా గ్రామాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపటడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజల కోరుతున్నారు.